

నగరి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు



పార్థసారథి నాయుడు - రాజేంద్రనాయుడు - ధనుష్కోటి - కుమార్



ఓవైపు సగభాగం దెబ్బతిన్న బస్సు



రక్తమోడిన రహదారి

- ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రైవేటు బస్సును ఢీకొట్టిన లారీ
- నలుగురి దుర్మరణం
- 13 మందికి తీవ్రగాయాలు
- వీరిలో ఒకరి పరిస్థితి విషమం
- రాత్రి 9 గంటలకు ప్రమాదం

నగరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణం సాయిబాబా గుడి సమీపంలోని తిరుపతి- చెన్నై జాతీయ రహదారి ఆదివారం రాత్రి 9 గంటలకు రక్తమోడింది. తమిళనాడుకు చెందిన ఓ ప్రైవేటు బస్సు ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తున్న సమయంలో ఎదురుగా ఓ లారీ ఢీకొట్టుకుంటూ వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బస్సుకు ఒకపక్క సగభాగం వరకు ధ్వంసమైంది. గాయపడ్డ ప్రయాణికుల హాహాకారాలతోపాటు రోడ్డంతా రక్తసిక్తమైంది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు కొంతసేపు నిశ్చేష్టులయ్యారు. ఆ తర్వాత తేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. బాధితులను స్థానికులు, పోలీసులు, 108 వాహన సిబ్బంది కలిసి నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు. డ్యూటీలోని సిబ్బంది కాకుండా వైద్యులు, ఇతర సిబ్బంది హుటాహుటిన వచ్చి బాధితులకు చికిత్స ప్రారంభించారు. ఆస్పత్రి రోదనలతో నిండిపోయింది. నగరి డీఎస్పీ అజీజ్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

మృతులు: తిరుత్తణికి చెందిన కుమార్(60), తిరువళ్లూరుకు చెందిన ధనుష్కోటి(12), వడమాలపేట మండలంలోని సీతారామాపురానికి చెందిన పార్థసారథి నాయుడు (62) రాజేంద్రనాయుడు(60).

గాయపడినవారు: రాధాకృష్ణ(తాడిపత్రి),సెల్వి(తిరుపతి),వెట్రివేల్(తిరువళ్లూరు),భరత్ (తిరుపతి), మురళి (ఊత్తుకోట), రుద్రమూర్తి (తిరువళ్లూరు),సుబ్బరత్నమ్మ (తాడిపత్రి), సుధాకర్(తిరువళ్లూరు), చిన్నామలై(తిరువళ్లూరు),నాగేంద్ర(తాడిపత్రి), ఆయన తల్లి,అనూరాధ దంపతులు (శివగిరి). పరిస్థితి విషమంగా ఉన్న చిన్నామలైని తిరుపతికి తరలించారు.

తిరుత్తణిలో పెళ్లికి వెళ్లొస్తూ..

- 'నగరి' ప్రమాద మృతుల్లో ఇద్దరిది సీతారామపురం

ఆదివారం ఉదయం.. గ్రామస్తులతో కలిసి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను పార్థసారథి నాయుడు(62), రాజేంద్ర నాయుడు(60) కలిశారు. అమరావతి అభివృద్ధికి తమ గ్రామం తరఫున రూ.50 వేలు అందజేశారు. సాయంత్రం ఇద్దరూ కలిసి తిరుత్తణిలో పెళ్లికి వెళ్లారు. తిరిగొచ్చే క్రమంలో నగరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సులోని ఈ ఇద్దరు టీడీపీ నేతలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఈ ఇద్దరూ సమీప బంధువులు. వీరి మృతి సమాచారంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పార్థసారథి నాయుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉన్నాడు. రాజేంద్రకు ఓ కుమార్తె ఉంది. వీరిద్దరూ వ్యవసాయదారులే. వీరి మృతి పట్ల ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సంతాపం తెలియజేశారు. వీరి కుటుంబాలకు అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి



ఎమ్మెల్యేకు చెక్కు అందిస్తున్న సీతారామాపురానికి చెందిన టీడీపీ నాయకులతో పార్థసారథి నాయుడు, రాజేంద్రనాయుడు (సర్కిల్‌లోని వ్యక్తులు)







1. ఇంట్లో చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు
2. సీసీ కెమెరాల్లో రికార్డయిన దొంగలు
3. వెనుక గేటు తాళం పగలగొట్టి లోపలకు వెళ్లారిలా..

సోలార్ ఫెన్సింగ్ కట్ చేసి.. గోడ దూకి

తిరుపతిలో రెచ్చిపోయిన దొంగలు

- రెండు విల్లాల్లో 720 గ్రాముల బంగారం, రూ.4.50 లక్షల నగదు, 1.650 కిలోల వెండి అపహరణ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం వద్దనున్న సీపీఆర్ విల్లాస్‌లో శనివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. రెండు విల్లాల్లో దాదాపు 780 గ్రాముల బంగారు నగలు, 1.650 కిలోల వెండి వస్తువులు, రూ 4.5 లక్షల నగదు అపహరించుకెళ్లారు. ఈ వివరాలను ఆదివారం తిరుపతి క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. సీపీఆర్ విల్లాస్‌లోని 81వ నెంబరు ఎలక్ట్రానిక్ సంస్థలకు సలహాదారుగా పనిచేస్తున్న మేఘనాదన్ నివాసం ఉంటున్నారు. బంధువుల పెళ్లి ఉండటంతో బ్యాంకు లాకర్ నుంచి బంగారు నగలు, వెండి వస్తువులను శనివారం తీసుకొచ్చారు. మేఘనాదన్ దంపతులు మొదటి అంతస్తులో.. అతని అత్త, కుమారుడు రెండో అంతస్తులో పడుకున్నారు. లాకర్ నుంచి నగలు తెచ్చిన విషయాన్ని గమనించిన దుండగులు చోరీకి ప్లాన్ చేశారు. శనివారం అర్ధరాత్రి 12.30 గంటలకు ఐదారు మంది విల్లా వెనుక ఖాళీ స్థలం నుంచి ప్రహరీ సోలార్ ఫెన్సింగ్ కట్ చేశారు. వ ం ట్టి డంప్‌పైకి ఎక్కి గోడ దూకి లోపలకు వెళ్లారు. మొదట ఇద్దరు 81వ నెంబరు విల్లా వెనుక వైపున్న అల్యూమినియం డోర్ లాక్‌ను కట్ చేశారు. బెడ్‌రూములో భద్రపరచిన 735 గ్రాముల బంగారు నగలు, 1.650 కిలోల వెండి వస్తువులు, 800 యూఎస్ డాలర్లు, రూ.4.50 లక్షల నగదు అపహరించారు. ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేశారు. ముందుగానే హాలులో ఉన్న రెండు సీసీ కెమెరాలను పగలగొట్టారు. అయితే మేఘనాదన్ మొబైల్ నెంబరుకు నెట్ కనెక్టు అయి ఉండటంతో దొంగల ఫొటోలు అందులో నిక్షిప్తంగా పోలీసులకు కొంతవరకు ఆధారాలు దొరికాయి.

విల్లా నెంబరు 82లోనూ..

ఇక్కడి విల్లాస్‌లోని 82లో దొర ప్లాస్టిక్స్ అధినేత కేశవులు నాయుడు కుమారుడు జగదీష్ నివాసం ఉంటున్నారు. వీరి కుటుంబ సభ్యులు మొదటి అంతస్థులో పడుకుని ఉన్నారు. ఈ విల్లా వెనుక అల్యూమినియం డోర్‌లాక్‌ను స్క్రూ డ్రైవర్‌తో పగులకొట్టి లోపలకు ప్రవేశించారు. బెడ్‌రూములో భద్రపరచిన 45 గ్రాముల బంగారు నగలు, నాలుగు డైమండ్ లాకెట్లు, బ్లాక్ బీట్‌లు మూడు, చెవికమ్మలు ఒక జత అపహరించారు. ఇదే విల్లా నుంచి రెండు బ్యాగుల్లో వున్న మూడు కిలోల వెండి వస్తువులను ప్రహరీ బయట పడేసి వెళ్లారు. వీటిని పోలీసులు స్వాధీనం చేసుకుని జగదీష్‌కు అప్పగించారు. అలాగే, వ్యాపారవేత్త శ్రీనివాసరావు, కాశీవిశ్వనాథ్‌కు చెందిన 78, 80 విల్లాల్లోనూ చోరీకి యత్నించారు. ఇక్కడ, కిటికీ స్లైడింగ్ తీసి సీసీ కెమెరాలు పక్కకు నెట్టి లోపలకు వెళ్లారు. కానీ, ఎటువంటి చోరీ జరగలేదు.. రెండు విల్లాల్లో చోరీపై బాధితులు తిరుపతి క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు.



విల్లా వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

పోలీసుల పరిశీలన

తిరుపతి క్రైం, శాంతిభద్రతల ఏఎస్పీలు నాగభూషణరావు, రవిమనోహరాచ్చారి, డీఎస్పీలు శ్యాంసుందర్, నరసింగప్ప, సీఐలు చిన్న గోవిందు, శివకుమార్ రెడ్డి, తిరుచానూరు ఎస్ఐలు అరుణ, జగన్నాథ రెడ్డి, సాయినాథ చౌదరి, క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్ నిపుణులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వేలిముద్రలు, దొంగలు ఎర్రమట్టి తొక్కి వచ్చిన పాద ముద్రలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఐదారు మంది ఈ చోరీలకు పాల్పడినట్లు తెలిసింది. ప్రతి ఇంట్లోకి ఇద్దరేసి వెళ్ళినట్లు పోలీసులు చెబుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎస్పీ హర్షవర్ధనరాజు ఘటనా స్థలానికి చేరుకుని చోరీలు ఎలా జరిగాయని ఆరా తీసారు. దొంగల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాలన్నారు. క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సెనెట్ హాలులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ శుభంబన్సల్

నేడే డిప్యూటీ మేయర్ ఎన్నిక

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- క్యాంపుల నుంచి కార్పొరేటర్ల తిరుగుముఖం

తిరుపతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హైడ్రామాకు తెరలేపిన తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక క్లైమాక్స్‌కు చేరుకుంది. సోమవారం ఉదయం 11 గంటలకు ఎస్వీ విశ్వవిద్యాలయం సెనేట్ హాలులో ఎన్నిక జరగనుంది. డిప్యూటీ మేయర్ పదవి ఎవరిని వరిస్తోందనని సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. క్యాంపులకు వెళ్లిన కార్పొరేటర్ల చేతిలో డిప్యూటీ మేయర్ విజయం దాగుంది. వివిధ ప్రాంతాల్లో విడిది చేస్తున్న కార్పొరేటర్లు తిరుపతికి తిరుగుముఖం పట్టారు. 50 డివిజన్లు కలిగిన తిరుపతి కార్పొరేషన్లో వివిధ కారణాల వలన 3 డివిజన్లకు కార్పొరేటర్లు లేరు. అంటే 47 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు ఓటు హక్కు వినియోగించుకుంటే ఆ సంఖ్య 50కు చేరుతుంది. ప్రస్తుతం కూటమి చెంత 24 మంది కార్పొరేటర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యుడైన ఎమ్మెల్యే ఓటు కలిపితే 25 ఉన్నాయి. వైసీపీ కార్పొరేటర్ ఒకరు అనారోగ్య కారణంగా రాలేకపోతున్నట్టు సమాచారం దీంతో వైసీపీకి ఎంపీ, ఎమ్మెల్సీ రెండు ఓట్లు కలుపుకొన్నా.. ఒక ఓటు ఆధిక్యతతో కూటమి అభ్యర్థి గెలుపొందుతారు. అదేకాకుండా వైసీపీ క్యాంపులో ఉండే కార్పొరేటర్లలో ముగ్గురు కూటమివైపు చేతులెత్తే సూచనలున్నాయి. వైసీపీ విప్ జారీ చేసిన నేపథ్యంలో ఎవరికీ చేతులెత్తకుండా మౌనంగా ఉండే కార్పొరేటర్లు కూడా లేకపోలేదన్న చర్చ జరుగుతోంది. ఇలాంటి ఉత్కంఠకు తెరపడాలంటే మరికొన్ని గంటలు వేచిచూడాల్సి వుంది.

పకడ్బందీ ఏర్పాట్లు

డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రత్యేక సమావేశానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న జేసీ శుభంబన్సల్ ఆదివారం ఎస్వీయూ సెనేట్ హాలులో ఏర్పాట్లను పరిశీలించారు.ఈ ప్రత్యేక సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న నేపథ్యంలో కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు ముందుగానే సెనేట్ హాలుకు రావాలని సూచించారు.సెల్‌ఫోన్లు, బంధుమిత్రులకు అనుమతి లేదన్నారు. గుర్తింపు కార్డు తప్పనిసరని చెప్పారు. జేసీతో పాటు అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జి.ఎం. చంద్రమౌళి, ఎస్ఈ సురేంద్ర, సెక్రటరీ రాధిక, తహసీల్దార్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వేద వర్సిటీలో చిరుత!

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వేద యూనివర్సిటీలో చిరుత సంచారం విద్యార్థులను కలవర పెడుతోంది. ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో రామేశ్వరం భవన్‌కు ఎదురుగా గల చెట్ల పొదల్లో చిరుత కనిపించింది. అటువైపుగా వెళుతున్న వర్సిటీ ఉద్యోగి ఒకరు తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బందికి ఆయన సమాచారాన్ని చేరవేశారు. వారు సెక్యూరిటీ వాహనంలో సైరన్ మోగించినా చిరుత కదలకపోవడం గమనార్హం. వేద వర్సిటీలో ఏదో ఒక చోట చిరుత సంచరిస్తుండటం విద్యార్థులు, ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోంది.



రేపటి రథసప్తమికి

ఏర్పాట్లు పూర్తి

- ఉదయం నుంచి రాత్రి వరకు వాహనసేవలు

తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం జరిగే రథసప్తమికి టీటీడీ ఏర్పాట్లు పూర్తిచేసింది. వేకువజాము నుంచి రాత్రి వరకు మలయప్పస్వామి ఏడువాహనాలపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. వాహన సేవలను తిలకించేందుకు గ్యాలరీల్లో కూర్చునే భక్తులు ఎండకు, చలికి ఇబ్బంది పడకుండా తాత్కాలిక షెడ్లు వేశారు. నిరంతరాయంగా సాంబారన్నం, పెరుగన్నం, పులిహోర, పొంగళి తదితర అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ, టీ, కాఫీ, పాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీరు, మరుగుదొడ్లను సిద్ధం చేశారు.

వాహన సేవలిలా..

ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు సూర్యప్రభవాహనం, 9-10 వరకు చిన్నశేషవాహనం, 11-12 వరకు గరుడవాహనం, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు హనుమంతవాహనం, వెంటనే చక్రస్నానం, సాయంత్రం 4- 5 వరకు కల్పవృక్ష, 6-7 వరకు సర్వభూపాల, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభవాహన సేవలను నిర్వహించనున్నారు.





మాడవీధుల్లోని గ్యాలరీల్లో వేసిన షెడ్లు



చిన్నారి నిత్య శరీరంపై వాతలు

అన్న పిల్లలపై తమ్ముడి కర్కశత్వం

మద్యం తాగొచ్చి వాతలు పడేలా దాడి

చిట్టమూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అన్న పిల్లలపై తమ్ముడు కర్కశంగా ప్రవర్తించాడు. మద్యం తాగొచ్చి ఇంట్లో ఒంటరిగా ఉన్న చిన్నారులను కర్రతో వాతలు తేలేలా చితకబాదాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు... చిట్టమూరు మండలం, కోగిలి ఎస్సీ కాలనీకి చెందిన దామరపు రాజయ్య, పోలమ్మ దంపతులకు కుమారుడు జానీ(4), కుమార్తె నిత్య(5) ఉన్నారు. రాజయ్య దంపతులు మేనకూరులోని ఓ పరిశ్రమలో పని చేస్తారు. శనివారం ఇద్దరూ విధులకు వెళ్లారు. సాయంత్రం పొద్దుపోయాక రాజయ్య తమ్ముడు ముత్యాలయ్య పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజయ్య కుమారుడు జానీ, కుమార్తె నిత్యను నిర్బంధించి కర్రతో తీవ్రంగా కొట్టాడు. బాబాయ్ ఎందుకు కొడుతున్నాడో తెలియని చిన్నారులు ఏడుస్తూ కాళ్లు, చేతులు పట్టుకొని బతిమలాడినా కనికరించని ముత్యాలయ్య వాతలు పడేలా పిల్లలను కొట్టాడు. అరిస్తే చంపేస్తాని బెదిరించడంతో భయపడిపోయిన చిన్నారులు ఎవరికీ చెప్పుకోలేక నొప్పులతో అల్లాడిపోయారు. రాత్రి 11 గంటలకు ఇంటికొచ్చిన రాజయ్య, పోలమ్మ తమ బిడ్డల శరీరంపై ఉన్న గాయాలను చూసి తల్లడిల్లిపోయారు. ఏం జరిగిందని ఆరా తీయగా బాబాయ్ కొట్టాడని చెప్పారు. వెంటనే పిల్లలను తీసుకొని పోలీస్ స్టేషనుకు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ చిన్న బలరామయ్య కేసు నమోదు చేశారు. నిందితుడు ముత్యాలయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

భార్యపై భర్త కత్తితో దాడి.. ఆపై ఆత్మహత్యాయత్నం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): భార్యభర్తల నడుమ ఏర్పడిన స్వల్ప వివాదంతో ఆవేశానికి లోనైన భర్త, భార్యపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. వెంటనే మనస్తాపానికి గురై తాను కూడా ఆత్మహత్యాయత్నం చేశాడు. నాయుడుపేట పట్టణంలోని కుమ్మరివీధిలో నివాసం ఉంటున్న సురేష్, లత దంపతుల మధ్య కుటుంబకలహాలతో వివాదం ఏర్పడింది. శనివారం అర్ధరాత్రి లతపై సురేష్ కత్తితో దాడి చేశాడు. అదే కత్తితో తానూ పొడుచుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గుర్తించి భార్యభర్తలను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.





గాయపడిన లత, సురేష్

పెద్ద పంచాయతీలో ఆలనాపాలనా ఇలాగేనా?

●ఆరేళ్లుగా లేని కార్యదర్శి ● ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్న వైనం ● పర్యవేక్షణ కొరవడి అధ్వానంగా పారిశుధ్యం


శంకరనాయుడుకాలనీలో అధ్వాన పారిశుధ్య పరిస్థితి ఇది

తిరుచానూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మేజర్ పంచాయతీల్లో ఒకటైన తిరుచానూరులో ఆలనాపాలనా కరువైంది. ప్రసిద్ధ అమ్మవారి ఆలయం ఉన్నది ఇక్కడే. 20 వార్డులున్న పంచాయతీలో 30వేల మందికిపైగా జనాభా, ఉన్నారు. ఏటా సుమారు రూ.6కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. అయినా వైసీపీ పాలనలో పంచాయతీ కార్యదర్శిని నియమించకుండా ఇన్‌ఛార్జిలతోనే కొనసాగించింది. కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు నెలలు గడుస్తున్నా కార్యదర్శి నియామకంలో జాప్యం కొనసాగుతూను ఉంది. సుమారు 2 నెలల క్రితం ఈవోపీఆర్డీ మాధురిని ఇన్‌ఛార్జి సెక్రటరీగా నియమించారు. తరువాత ఆమె సెలవుపై వెళ్లారు. దీంతో వెంకటరత్నాన్ని నియమించారు. ఆయన కూడా అడపా దడపా వచ్చి వెళుతున్నారనే ప్రజలు విమర్శిస్తున్నారు. సకాలంలో సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదంటున్నారు.

కొరవడిన చెత్తశుద్ధి

గ్రామంలో కొన్ని రోజులుగా ఎక్కడ చూసినా చెత్తకుప్పలే కనిపిస్తున్నాయి. సుమారు వంద మందికిపైగా పారిశుధ్య కార్మికులున్నా పర్యవేక్షణ కొరవడింది. అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో రోడ్డు పక్కనే వ్యర్థాలు కనిపిస్తుండటంతో భక్తులు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. పందులు కూడా స్వైరవిహారంచేస్తున్నాయి. మురగు కాలువలు శుభ్రం చేయడంలేదు. జననం, మరణం, నీటి పన్ను, పంచాయతీ అవసరాల కోసం వచ్చే ప్రజలకు కార్యదర్శి లేకపోవడంతో ఇబ్బందులుపడుతున్నారు. రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని వీరంతా కోరుతున్నారు.

అలరించిన చిన్నారుల భరతనాట్యం



తిరుచానూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా తిరుపతికి చెందిన లలితాంబిక నృత్యాలయం కళాకారులు ఆదివారం ప్రదర్శించిన నృత్యం మనోహరంగా సాగింది. కళాకారులు హర్షిణి, హంసిని, ధృతి, వల్లి, హరి, విష్ణు, వర్షిత, హిమ, యషు, పూజిత తదితరులు మహాగణపతిం, పుష్పాంజలి, శ్రీమన్నారాయణ, మూషిక వాహన రుద్రం పశుపతిం, చంద్ర చూడ, అఖిలాండేశ్వరి, దశవతారం, రామ రామ, శివ కల్యాణం వంటి కీర్తనలకు చక్కని భరత నాట్య ప్రదర్శన చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించారు.

ఘనంగా పశువుల పండుగ


ఇరంగారిపల్లెలో పశువుల పండుగను తిలకిస్తున్న యువత

పాకాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇరంగారిపల్లెలో ఆదివారం ఘనంగా పశువుల పండుగ నిర్వహించారు. పశువులను శుభ్రం చేసి అలంకరించి పూజలు చేసి వీధుల్లో ఊరేగించారు. ఎద్దులు, కోడె గిత్తల కొమ్ములకు పలకలు కట్టి జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తలను నిలువరించి బహుమతులు దక్కించుకోవడానికి యువత వాటి వెంట పరుగులు తీశారు. భారీగా ప్రజలు తరలి రావడంతో సందడి నెలకొంది.

తిరుచ్చిపై సుందరరాజస్వామి అభయం



తిరుచానూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్ర పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవర్లకు వేడుకగా అభిషేకం జరిగింది. ఉభయదేవేరిలతో పాటు స్వామివారికి ఆదివారం రాత్రి తిరువీధి ఉత్సవం జరిగింది. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాదు జయప్రదం చేయాలి:ఎమ్మార్పీఎస్


చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద డప్పు కొడుతున్న కార్యకర్తలు

చంద్రగిరి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు ఈనెల 7న తలపెట్టిన చలో హైదరాబాద్ వేల గొంతులు, లక్షల డప్పుల సాంస్కృతిక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్పీఎస్ నాయకులు కోరారు. ఆదివారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద వారు ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముందుగా జాతీయ రహదారి ఫ్లైఓవర్ నుంచి టవర్ క్లాక్ వద్ద అంబేద్కర్ విగ్రహం వరకు డప్పులు వాయిస్తూ ఎంఆర్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ప్రకటించిన సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లా ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకుడు పులికుంట్ల గోపిమాదిగ మాట్లాడుతూ రాజీవ్ రంజాన్ మిశ్రా నివేదికను వెంటనే అమలు చేయాలని పెద్ద ఎత్తున సంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వేలూరు రాజేంద్ర మాదిగ, నియోజకవర్గ నాయకులు బోయినపల్లి రవి మాదిగ, సంగీతం రామ్మూర్తి,బోయిన అంజి, కత్తి ఓబులేష్, కత్తి నాగార్జున, వెంకటపతి, సిద్దయ్య పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



భాకరాపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జంగావాండ్లపల్లె పంచాయతీ చినిగేపల్లె వద్ద కట్ట మీద గంగమ్మ ఆలయ శిఖర కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ట ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఈ సందర్భంగా నాడీ సంధానం, స్పర్శ ఆహుతి కాల న్యాసం, జయాధుల ప్రాయశ్చిత హోమాలు, మహాపూర్ణాహుతిలను నిర్వహించారు. కుంభజల సంప్రోక్షణ తర్వాత అమ్మవారిని విశేష అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

కర్రసాము విజేతలకు బహుమతుల ప్రదానం


ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

భాకరాపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట సాయిరాం పాఠశాలలో రాష్ట్ర స్థాయి కర్రసాము(ఘట్కా) పోటీలను ఆదివారం నిర్వహించారు. తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల నుంచి పలువురు విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాఘవేంద్ర మాట్లాడుతూ బాలికల ఆత్మరక్షణకు కర్రసాము తోడ్పడుతుందన్నారు. పోటీల్లో అన్నమయ్య జిల్లా ప్రథమ స్థానంలోనూ, తిరుపతి, చిత్తూరు జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఘట్కా చైర్మన్ సురేందర్ రెడ్డి, సాయిరాం కరస్పాండెంట్ జనర్దాన్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమికి ప్రణాళికాబద్ధంగా సేవలందించాలి: ఈవో


సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): రథసప్తమికి వచ్చే భక్తులకు ప్రణాళికబద్ధంగా సేవలు అందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఉద్యోగులను కోరారు. తిరుమలలోని ఆస్థానమండపంలో ఆదివారం జరిగిన సమావేశంలో టీటీడీ ఈవో, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, ఇంఛార్జి సీవీఎస్వో మణికంఠ, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. గ్యాలరీల్లో భక్తుల సేవలపై ముందస్తుగా క్షేత్రస్థాయిలో కార్యాచరణ సిద్ధం చేసుకుని సమిష్టిగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలీసులు, విజిలెన్స్ శాఖలతో సమన్వయం చేసుకుని అన్నదానం, పోలీసు, విజిలెన్స్, ఇంజినీరింగ్, వైద్య, ఆరోగ్య, శానిటేషన్ తదితర శాఖ అధికారులు, సిబ్బంది ఉమ్మడి కార్యచరణతో సేవలు అందించాలన్నారు. మాడవీధుల్లో దాదాపు 200 గ్యాలరీలు, 66 అన్నదాన కౌంటర్లు, 351 టాయిలెట్లు ఏర్పాటు చేశామన్నారు. అనదపు ఈవో వెంకయ్య చౌదరి, ఎస్పీ, సీవీఎస్వో మణికంఠ మాట్లాడారు.

వైభవంగా విద్య కామేష్టియాగం

రామచంద్రాపురరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాజశ్యామల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యకామేష్టి యాగాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యశామలదేవికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. పిల్లల చేత శక్తి పీఠాధిశ్వరి రమ్యానందభారతి అక్షరాభ్యాసం చేయించారు. సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి స్వామి అనుగ్రహ భాషనం చేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 5 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. ●శుక్రవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.78 కోట్లు ●శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,871. ●తలనీలాలు సమర్పించిన వారు: 24,257.

శ్రీవారిసేవలో ఐశ్వర్య రజినీకాంత్



తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ హీరో రజినీకాంత్ కుమార్తె ఐశ్వర్య ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున సుప్రభాతసేవలో పాల్గొని మూలమూర్తిని దర్శించుకున్నారు.

జాతీయ విజ్ఞాన ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

చంద్రగిరి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తొండవాడ వద్ద శ్లోక ఏ బిర్లా స్కూల్ విద్యార్థులు జాతీయ విజ్ఞాన ప్రదర్శనలో ప్రతిభ కనబరిచారు. హర్యానాలో ఇటీవల జరిగిన ప్రదర్శనలో 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 429 మంది పాల్గొన్నారు. శ్లోక ఏ బిర్లా స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ఆర్టిఫీషియల్ రైవనర్ డిటెక్టర్ ప్రాజెక్టుమన్ననలు పొందింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చాటిన శ్లోక ఏ బిర్లా స్కూల్ విద్యార్థులు బాలాదిత్య, కేతన్ క్రిష్, గైడ్ సతీష్‌లను స్కూల్ డైరెక్టర్ శ్రీవత్సవ, ప్రిన్సిపాల్ వీణావాణి, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు అభినందించారు.

హెచ్‌యూఎస్ మహిళా విభాగం కార్యవర్గం

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్‌పల్లిలోని రామ్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన హిందూ ఉపాధ్యాయ సమితి సమావేశంలో మహిళా విభాగ(మాతృశక్తి) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల పేర్కొన్నారు. మాతృశక్తి విభాగ రాష్ట్ర అధ్యక్షురాలిగా కె.మాధవి, జిల్లా అధ్యక్షురాలిగా మల్లీశ్వరిని ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరికి సంఘ సభ్యత్వం, నియామక పత్రాలను అందజేసి అభినందించారు. నూతనంగా ఎన్నికైన మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంఘ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. రవికుమార్‌రెడ్డి, మధుసూదన్, రెడ్డి రాజు, శేషగిరిరావు, రామ్మోహన్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

రేణిగుంట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడు నవీన్‌కు 14 రోజుల రిమాండ్‌కు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు ఎస్‌ఐ అరుణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ కేసులో అరెస్టు చేసిన అనంతపురం జిల్లాకు చెందిన నవీన్‌ను డీఎస్పీ శ్రీనివాసరావు విచారణ అనంతరం కోర్టుకు హాజరుపరచగా ఆ మేరకు న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్టు పేర్కొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు


టిక్కెట్లు కౌంటర్ వద్ద వేచి వున్న భక్తులు


అమ్మవారి ఆలయ పరిసరాల భక్తుల రద్దీ

తిరుచానూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వసంత పంచమి పర్వదినం సందర్భంగా ఆదివారం పద్మావతి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాల్లో ఎక్కడ చూసినా భక్తజన సందోహమే. సర్వదర్శనానికి సుమారు రెండు గంటలకు పైగా పట్టిందని భక్తులు తెలిపారు. క్యూలైన్లలో ఎండ వేడి, ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. కొన్ని ఫ్యాన్లు ఉండటంతో కాస్త ఉపశమనం పొందారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కుంకుమార్చన టిక్కెట్లు కుదించారు. సామాన్య భక్తులకే పెద్దపీట వేశారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్లు పొందిన భక్తులకు కూడా గంట పట్టింది. వారాంతం కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. స్కానింగ్ సెంటర్ వద్ద క్యూలైన్లలోకి కోతులు రావడంతో భక్తులు భయంతో కేకలు వేశారు. దీంతో అవి అక్కడి నుంచి పరుగులు తీశాయి. ఉత్సవాలు, సెలవు దినాలు, వారాంతపు రోజుల్లో కుంకుమార్చనకు ఎక్కువ సమయం ఇవ్వకుండా దర్శనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సాధారణ భక్తులు కోరారు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ


పద్మావతి వద్ద గదుల కోసం క్యూలైన్‌లో భక్తులు

తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): కొండపై ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. శుక్రవారం రద్దీ సాధారణంగానే ఉన్నప్పటికీ శనివారం మధ్యాహ్నం నుంచి భక్తుల సంఖ్య పెరిగింది. దీంతో మాడవీధులు, అఖిలాండం, లడ్డూ కౌంటర్, అన్నప్రసాద భవనం సందడిగా కనిపించాయి. మరోవైపు గదులకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. మంగళవారం రథసప్తమి నాడు ఏడువాహనాలపై శ్రీవారు దర్శనమివ్వనున్న క్రమంలో భక్తులు భారీగా వచ్చే అవకాశముంది. మంగళవారం వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేయడంతో రద్దీ కనిపించింది. ఆదివారం గది పొందితే సోమ, మంగళవారాల వరకు తిరుమలలోనే ఉండవచ్చునని చాలా మంది గదుల కోసం పోటీపడ్డారు. సిఫార్సు లేఖలపై గదులు కేటాయించే పద్మావతి ఎంక్వైరీ ఆఫీస్ కిటకిటలాడింది. కార్యాలయం ముందున్న క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ సర్కిల్ వరకు వ్యాపించింది. గదిని పొందేందుకు రెండు నుంచి మూడు గంటల సమయం పట్టింది. సీఆర్వో కూడా కిటకిటలాడింది.

గురుశిష్య బంధం

●60 ఏళ్ళ తరువాత కలయిక


జయరామ్ వడియార్ పాదాలకు నమస్కరిస్తున్న గంటలప్ప

చంద్రగిరి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 60 ఏళ్ళ తరువాత గురువును కలిసి ఆనందపరవశడయ్యాడో శిష్యుడు. కూచివారిపల్లెకు చెందిన జయరామ్ వడియార్ 1960-62లో రామకుప్పం మండలం ఎస్ గొల్లపల్లిలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ అవార్డు పొందిన ఈయన రిటైరయ్యాక కూచివారిపల్లెలో ఉంటున్నారు. ఎస్.గొల్లపల్లెకు చెందిన గంటలప్ప తన బాల్యంలో ఈయన దగ్గర విద్యాబుద్దులు నేర్చుకున్నారు. కొన్నాళ్లుగా తన గురువు జయరామ చిరునామా కోసం ప్రయత్నిస్తున్నారు. ఈక్రమంలో ఈయన కృషి ఫలించింది. కూచివారిపల్లెలో ఉంటున్నారని తెలుసుకుని ఆదివారం జయరామ్ ఇంటికి గంటలప్ప వెళ్లి అపరిమిత ఆనందం పొందారు. నాటి జ్ఞాపకాలు నెమరువేసుకొన్నారు.

స్థూల దేశీయోత్పత్తి పెంపు దిశగా బడ్జెట్


బడ్జెట్‌పై అవగాహన కల్పిస్తున్న గోపి

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)ని పెంచి వికసితభారత్‌గా అభివృద్ధి చేసేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని స్విమ్స్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ గోపి దేవరకొండ తెలిపారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ)తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో న్యూబాలాజీ కాలనీలోని గ్రీన్ హోమ్ డెవలపర్స్ కార్యాలయంలో ఆదివారం బడ్జెట్-2025పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గోపి మాట్లాడుతూ భారత్ రానున్న రోజుల్లో 5 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ దిశగా అడుగులు వేస్తోందన్నారు. గ్రామాలు, వ్యవసాయ అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ వి.భాగ్యతేజ ప్రభుత్వ, ఇతర రంగాల్లోని ఉద్యోగులు, చిరు వ్యాపారులు, పెద్ద వ్యాపారవేత్తలకు వర్తించే పన్నులు, పన్ను మినహాయింపునకు ఉన్న మార్గాలను వివరించారు. పీఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కార్యదర్శి డి.చంద్రమోహన్, కోశాధికారి ఆచార్య చక్రవర్తి రాఘవన్, సభ్యులు ఆర్సీకే రాజు, మధుసూదన్, రాజేష్, మాజీ చైర్మన్లు డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కుప్పంబాదూరు పరిధిలో విద్యుత్ అంతరాయం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కుప్పంబాదూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.గిరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు నేపథ్యంలో మిట్టకండ్రిగ, కొత్తకండ్రిగ, పరమాల, సీకేపల్లి, ఎన్ఆర్ కమ్మపల్లి, రాయలచెరువుపేట పరిధిలో విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి చిత్తూరు జిల్లా యూత్ కోఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఎమ్మార్‌పల్లిలోని యూత్ హాస్టల్‌లో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆర్థిక సౌజన్యంతో మహర్షి అభ్యుదయ సేవా సంస్థ(మాస్) ఆధ్వర్యంలో ఆదివారం చంద్రగిరి జోన్ బ్లాక్‌లెవల్ స్పోర్ట్స్ నిర్వహించారు. పంచాయతీలు, సంస్థలో పనిచేసే ఉద్యోగులకు షటిల్, వాలీబాల్, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ వంటి పోటీలను నిర్వహించారు. విజేతలను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. మాస్ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి, గణాంక అధికారి బాబురెడ్డి, అవిలాల సర్పంచ్ వెంకటరమణపాల్గొన్నారు.

ఎక్స్ అఫిషియో సభ్యుడి ప్రమాణస్వీకారం


ధ్వజస్తంభానికి మొక్కుతున్న రామచంద్రమోహన్

తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దేవదాయశాఖ కమిషనర్(ఎఫ్ఏసీ) కె.రామచంద్రమోహన్ ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణస్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆయనతో ప్రమాణం చేయించారు. అనంతరం రామచంద్రమోహన్ కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు శ్రీవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కళలు దేశ సమైక్యత, సమగ్రతకు చిహ్నాలు


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కళలు దేశ సమైక్యత, సమగ్రతకు చిహ్నాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి జీవకోన గురుకృప పాఠశాలలో జానపద సంగీత నృత్య ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన చంద్రశేఖరరెడ్డితో కలిసి బాలికల సంక్షేమ వసతి గృహ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయశ్రీ, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ నరసింహులు, నేస్తం కార్యదర్శి ఏడుకొండలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దేశంలో విభిన్న సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. నృత్య, సంగీత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కవులను, కళాకారులను, అతిథులను ఘనంగా సత్కరించారు. కొత్తపల్లి గంగాధరం, కళాభిమాని లీలావతి, షణ్ముగం, ధరణి పాల్గొన్నారు.



తిరుపతి 'తొక్కిసలాట' ఘటనపై కమిషన్ ముందు హాజరయ్యేందుకు ఆదివారం కలెక్టరేట్‌కు వచ్చిన అదనపు ఎస్పీ రవి మనోహర్ ఆచారి- రుయా ఆస్పత్రి అధికారులు

ఏవీఎస్వోల నియామకంలో అలసత్వం

తిరుమల, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో ఏవీఎస్వోల కొరత కనిపిస్తోంది. మూడునెలలు గడుస్తున్నా నియామకంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా ఏవీఎస్వోల కింద పనిచేసే వీఐలు, జమేదార్లపై అదనపు పనిభారం పడుతోంది. టీటీడీలో సెక్టార్ల వారీగా ఏవీఎస్వో(అసిస్టెంట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్)లు ఉంటారు. వీఎస్వోల కింద వీరి విధులు నిర్వహిస్తుంటారు. సీఐ స్థాయి అధికారులను ప్రభుత్వం డిప్యూటేషన్‌పై టీటీడీ విజిలెన్స్ విభాగంలో ఏవీఎస్వోలుగా నియమిస్తుంది. గతేడాది అక్టోబరులో ఏవీఎస్వో మనోహర్, పరకామణి ఏవీఎస్వో శివయ్య, సెక్టార్-4 ఏవీఎస్వో సాయి గిరిధర్, వింగ్ ఏవీఎస్వో పద్మనాభన్‌లను టీటీడీ నుంచి మాతృసంస్థకు పంపారు. అప్పటి నుంచి ఈ బాధ్యతలను ఇతర సెక్టార్లలోని ఏవీఎస్వోలు, వీఎస్వోలే చూస్తున్నారు. ఆలయం, వింగ్‌కు ఏవీఎస్వోలు లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఇద్దరు ఏవీఎస్వోలను తిరుమలకు రప్పించి శిక్షణ ఇస్తున్నట్టు తెలిసింది. సాధారణంగా ఈ నాలుగు విభాగాలకు అనుభవం ఉన్న అధికారులను నియమించాలి. .తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, గోవిందరాజస్వామి వంటి ప్రాంతాలు ఏడో సెక్టార్ కిందకు వస్తాయి. ఈ సెక్టార్‌కు ఉన్న ఏవీఎస్వోను బదిలీ చేసి దాదాపు రెండేళ్లు గడుసున్నా ఇంతవరకు నియామకం జరగలేదు. ఎస్‌ఐ స్థాయి అధికారి వీఐనే ఈసెక్టార్ బాధ్యతలు చూస్తున్నారు. బయటప్రాంతాల్లోని ఆలయాలకు నిర్వహణ తొమ్మిదో సెక్టార్ కిందకు వస్తుంది. ఈ సెక్టార్ ఏవీఎస్వో కూడా ఏడాది క్రితమే బదిలీ అయ్యారు. దీంతో 6వ సెక్టారు ఏవీఎస్వోనే తొమ్మిదో సెక్టార్ బాధ్యతలను అదనంగా చూస్తున్నారు. నిత్యం లక్షలాది మంది భక్తులతో కిటకిటలాడే తిరుమల, తిరుపతిలో ఇలా భద్రతాధికారుల నిమాయకంపై ఉన్నతాధికారులు అలసత్వం చూపడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.





తిరుపతి పుస్తక ప్రదర్శనకు పాఠకులు పోటెత్తారు. ఇస్కాన్ టెంపుల్ సమీపంలోని వినాయక గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచే ప్రారంభమైంది. ఎండను సైతం లెక్క చేయకుండా జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకించి చిన్నారులు, విద్యార్థులు ఎక్కువగా కన్పించారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలకు కూడా జనం పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- తిరుపతి విశ్వవిద్యాలయాలు, ఆంధ్రజ్యోతి

పోటెత్తిన పాఠకులు

- రెండో రోజు తిరుపతి పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన
- పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించి కొనుగోలు చేసిన యువత
- ఆకట్టుకున్న ప్రసంగాలు, సాంస్కృతిక ప్రదర్శనలు



● పాఠక స్వరం

స్పేస్ టెక్నాలజీ పుస్తకాల కోసం చూస్తున్నా..



బుక్ ఫెయిర్ చాలా బాగుంది.కామిక్స్ అంటే చాలా ఇష్టం. ఆ పుస్తకాలతో పాటు ప్రత్యేకించి స్పేస్ టెక్నాలజీ పుస్తకాల కోసం బుక్ ఫెయిర్‌లో వెతుకుతున్నాను. స్పేస్ సైంటిస్ట్ కావాలనే లక్ష్యంతో స్పేస్ పుస్తకాలు చదవాలనే కోరిక పెరుగుతూ ఉంది.

- భువన కార్తికేయ, ఫస్ట్ క్లాస్, స్ప్రింగ్ బర్డ్ స్కూల్



సైన్స్ ఫిక్షన్ పుస్తకాలంటే ఇష్టం

బెంగుళూరులోని జైన్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ ద్వారా ఎంబీఏ కోర్సు చేస్తున్నాను. ఈ బుక్ ఫెయిర్‌లో ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పుస్తకాలు చూస్తున్నాను. ముఖ్యంగా సైన్స్ ఫిక్షన్ పుస్తకాలంటే నాకు చాలా ఇష్టం. బుక్ ఫెయిర్‌లో ఎక్కడ సైన్స్ ఫిక్షన్ పుస్తకాలు కనిపించినా వదిలిపెట్టను. నాన్న సురేష్ సహకారంతో వీల్‌చైర్‌లో బుక్ ఫెయిర్ అంతా చుట్టేస్తున్నాను.

- ఎస్.శ్రేయ, ఎంబీఏ విద్యార్థిని, జైన్ యూనివర్సిటీ, బెంగళూరు

మిస్టరీస్ అంటే మహా ఇష్టం



ఈ బుక్ ఫెయిర్‌లో కొత్త పుస్తకాలు బాగా ఆకట్టుకుంటున్నాయి. కథలు, కార్టూన్లు వంటి చాలా పుస్తకాలు కనిపిస్తున్నాయి. ఎన్ని పుస్తకాలు చూస్తున్నా మిస్టరీస్‌కు సంబంధించినవి అంటే మహాఇష్టం. బుక్ ఫెయిర్‌కు వాటి కోసమే వచ్చాను.


- హితిక, 6వ తరగతి, భారతీయ విద్యా భవన్

● పుస్తక ప్రపంచం.. సుస్మితా మానస పబ్లికేషన్స్



తిరుపతి పుస్తక ప్రదర్శనలో స్టాల్ నెంబరు-39లో సుస్మితా మానస ప్రచురణలకు సంబంధించిన పుస్తక ప్రతులు ప్రదర్శించారు. హైదరాబాదుకు చెందిన సుస్మితా మానస పబ్లిక్ హెల్త్‌కు సంబంధించిన పీజీ కోర్సు పూర్తి చేశారు. వృత్తిరీత్యా పరిశోధన పట్ల ఆసక్తి ఉన్న ఈమె, సాహిత్య సృజన పట్ల ఆసక్తి ఏర్పరుచుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన తండ్రి, గృహిణిగా ఉన్న తల్లి సుమారు పదివేల పుస్తకాలు ఇంట్లో ఏర్పాటు చేసుకున్నారు. ఈ పుస్తకాల ప్రభావంతోనే తాను రచన చేసినట్టు మానస చెబుతున్నారు. ఆంగ్లంలో 'ఏంజిల్' అనే పేరుతో ఒక నవల రాశారు. 2024 ఆగస్టులో ఈ పుస్తకాన్ని ప్రచురించారు. గతంలో హైదరాబాదు పుస్తక ప్రదర్శనలో సంగీత దర్శకుడు కీరవాణి, విజయవాడ పుస్తక ప్రదర్శనలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ పుస్తకాన్ని తనవద్ద కొన్నారని సుస్మితా మానస సంతోషం నిండిన కళ్లతో చెప్పారు. కొత్తతరం మహిళా రచయిత్రులకు ఆమె ప్రేరణగా నిలుస్తున్నారు.

మన పుస్తకం - మట్టి అద్దం



బీఎన్ కండ్రిగ మండలం కళ్లివెట్టు హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు యువశ్రీ మురళి ఈ కవితా సంపుటిని రాశారు. 2024 జనవరిలో ఈ పుస్తకం ప్రచురితమైంది. 80 పేజీలు గల ఈ పుస్తకం ధర రూ.100. ప్రగతిశీల భావజాలంతో కూడిన ఈ పుస్తకంలో వివిధ సందర్భాల్లో కవి యువశ్రీ మురళి తన ప్రతిస్పందనగా రాసిన 44 కవితలు ఉన్నాయి. తిరుపతి బుక్ ఫెయిర్‌లోని తిరుపతి జిల్లా రచయితల సంఘం స్టాల్ - 56లో ఈ పుస్తకం లభ్యమవుతుంది.



ఆకట్టుకున్న సంగీత గేయావధానం

సారంగపాణి వేదికపై ఆదివారం సాయంత్రం పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో నిర్వహించిన సంగీత గేయావధానం అద్యంతమూ ఆకట్టుకుంది. వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సాయికృష్ణ యాచేంద్ర నిర్వహించిన ఈ సంగీత గేయావధానం అందరినీ అలరించింది. వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య రాణీ సదాశివమూర్తి పాల్గొన్నారు. అంతకుముందు ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణరాజు, డాక్టర్ అల్లాడి మోహన్, డాక్టర్ దొమ్మరాజు యువశ్రీ, పలువురు సాహిత్యవేత్తలు పాల్గొన్నారు.



పుస్తక ప్రదర్శనలో విరసం నేత

ఆదివారం నాటి పుస్తక ప్రదర్శనలో విప్లవ రచయితల సంఘం (విరసం) నేత, నెల్లూరు జిల్లా కావలిలో గల జవహర్ భారతి కళాశాల తెలుగు విశ్రాంత అధ్యాపకులు వి.చెంచయ్య వచ్చారు. పుస్తక ప్రదర్శనలోని వివిధ స్టాళ్లను పరిశీలించి పలు పుస్తకాలను కొనుగోలు చేశారు. పుస్తక ప్రదర్శన పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పుస్తక విజ్ఞానాన్ని కొత్త తరానికి చేరువ చేయాలనే ప్రయత్నం అభినందనీయమన్నారు. ఆయన వెంట సాహిత్యవేత్తలు ఆర్వీ కృష్ణస్వామిరాజు, పేరూరు బాలసుబ్రమణ్యం ఉన్నారు.

నేనేం చదువుతున్నానంటే?



తిరుమల, తిరుపతితో సంబంధం గల చరిత్ర పుస్తకాలు చదువుతున్నాను. సాధు సుబ్రమణ్యశాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లె అనంతకృష్ణ శర్మ, గౌరిపెద్ది రామసుబ్బ శర్మ వంటి వారు రాసిన చారిత్రక, సాహిత్య, సంగీత రచనలు ఇష్టంగా చదువుతున్నాను. రాయలసీమ ప్రాంతంలోని ప్రముఖ దేవాలయాల చరిత్రకు సంబంధించిన పుస్తకాలు కూడా చదువుతున్నాను. కన్నడలో వసుదేంద్ర రాసిన తేజో తుంగభద్ర నవలను రంగనాథ రామచంద్ర తెలుగులోకి అనువదించారు. 15వ శతాబ్దం నాటి ఓ ముస్లిం - క్రిస్టియన్ ప్రేమజంట కథ ఇది.

- డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, రచయిత, పరిశోధకులు

పుస్తక ప్రదర్శనలో నేడు

సోమవారం సాయంత్రం 6 గంటలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎస్వీయూ ఆంగ్ల విభాగ రిటైర్డు ప్రొఫెసర్ మధురాంతకం నరేంద్ర రాసిన పుస్తకాలను ఆవిష్కరించనున్నారు. ఓఆర్ఐ డైరెక్టర్ ఆచార్య వీసీ వేంకటేశ్వర్లు గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ పుస్తక ప్రదర్శన నిర్వహిస్తారు.

మా కార్పొరేటర్లపై బెదిరింపులకు పాల్పడుతున్నారు

వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికలకు సంబంధించి మా కార్పొరేటర్లపై కూటమి నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ అభ్యర్థిగా ఉన్న శేఖర్‌రెడ్డి భవనాలను కూల్చి లోబరుచుకున్నారన్నారు. అదేవిధంగా కార్పొరేటర్లు డాక్టర్ అనీష్‌రాయల్, అమరనాథరెడ్డి, మునిరామిరెడ్డి బిల్డింగ్‌లను కూడా కూల్చివేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికలకు సంబంధించి విప్ కూడా జారీ చేయడం జరిగిందని, ధిక్కరిస్తే పార్టీ సభ్యత్వాన్ని కోల్పోతారని స్పష్టం చేశారు. తమ పార్టీ అభ్యర్థి లడ్డూ భాస్కర్ డిప్యూటీ మేయర్‌గా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్ తమ్ముడు గణేష్, నాయకులు నల్లాని బాబు, ఉదయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండుకు సమీపంలోని ఫ్లైవోవర్‌పై కారు వేగంగా వెళుతూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. అయితే కారులోని వారికి ఎటువంటి గాయాలూ కాలేదు.

ఈస్ట్ సీఐగా నరసింహారావు బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ సీఐగా నరసింహారావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన రామకృష్ణ 10 రోజులపాటు వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. వీఆర్‌లో ఉన్న నరసింహారావును ఇన్‌చార్జిగా నియమించారు. గతంలో ఈయన శ్రీకాళహస్తిలో విధులు నిర్వహించారు.

నేడు ఎస్వీయూ పరిపాలనా భవన ఉద్యోగులకు సెలవు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిపాలనా భవనానికి నేడు సెలవు ప్రకటించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ స్థానానికి సెనేట్ హాల్లో ఎన్నికలు నిర్వహిస్తుండమే ఇందుకు కారణం. అయితే పరిపాలనా భవనంలో అత్యవసర సేవలు కొనసాగుతాయని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు తెలిపారు.

అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి కన్వెన్షన్ హాల్ ప్రారంభం

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పద్మావతీపురంలో నిర్మించిన అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి మినీ కన్వెన్షన్ హాల్‌ను శోభన్‌బాబు కుమారుడు కరుణశేషు ఆదివారం ప్రారంభించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన శోభన్‌బాబు అభిమానుల సంఘం గతేడాది నిర్మాణం మొదలుపెట్టింది. సంఘం సభ్యుడు వీరప్రసాద్(టీటీడీ ఏఈ)మాట్లాడుతూ శోభన్‌బాబుకు సంబంధించిన కార్యక్రమాలు, అభిమానుల శుభకార్యాలు ఇందులో ఉచితంగా జరుపుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి కన్వీనర్స్ ఎం.సుధాకర్‌బాబు, టి.సాయికామరాజు, బి.బాలసుబ్రహ్మణ్యం, జవహర్‌బాబు, పి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, యు.విజయ్, కె.రాంబాబు, ఎస్.ఎన్.రావు తదితరులు పాల్గొన్నారు.



హాలును ప్రారంభిస్తున్న కరుణశేషు

నైతికత గురించి నువ్వే మాట్లాడాలి

భూమనపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఫైర్



తిరుపతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ప్రజాస్వామ్య విలువలు, నైతికత గురించి మాట్లాడుతుంటే తిరుపతి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వ్యాఖ్యానించారు. ఆదివారం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో తిరుపతిలో కరుణాకరరెడ్డి చేసిన అరాచకాలు అన్నీఇన్నీ కావన్నారు. స్థానిక సంస్థలు, టౌన్ బ్యాంకు, ఉప ఎన్నికల్లో వైసీపీ దౌర్జన్యాలను నగర ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదన్నారు. మేయర్ అధికారాలను కూడా కుమారుడు అభినయ్ చేతికి తీసుకుని శాసించిన విషయం మరిచారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఆమెకు సముచిత స్థానం కల్పించి గౌరవించామని, కార్పొరేటర్లకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని గుర్తు చేశారు. కపిలతీర్థం సర్కిల్లో స్వార్థ ప్రయోజనాల కోసం హోటల్‌ను నిర్మించి లబ్ధిపొందుతున్నది మీరు కాదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ శ్రీకాళహస్తిలో శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, సమీక్షల కోసం వస్తే ఆయనపై కరుణాకరరెడ్డి నోరు పారేసుకోవడం తగదన్నారు. కార్పొరేటర్లను బెదిరించాల్సిన అవసరం మంత్రికి లేదన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఇలాంటి చర్యలకు పాల్పడరని, వారిపేర్లు ఎత్తే అర్హత కూడా లేదని స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వ అక్రమాలను అడ్డుకోవాలి

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నేతలు

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ అక్రమాలను అడ్డుకోవాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వైసీపీ జిల్లా, నగర, అనుబంధ విభాగాల్లో పార్టీ పదవులు పొందిన వారితో ఆదివారం తిరుపతిలోని మాజీ మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ప్రమాణస్వీకార మహోత్సవం నిర్వహించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు పోరాట యోధులు కావాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ కూటమి తప్పులు ఎత్తి చూపుదామన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, మాజీ ఎమ్మెల్యేలు వెంకటేగౌడ, సునీల్, రాజేష్, భూమన అభినయ్, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

పడకేసిన నిఘా

- రెండు నెలల్లో 10 చోరీలు
- మొన్న దామినేడులో కల్తీ మద్యం తయారీ కలకలం
- నేడు సీపీఆర్ విల్లాస్‌లో చోరీ
- వరుస ఘటనలతో హడలిపోతున్న నగర ప్రజలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు నిఘా పడకేసింది. రాత్రిపూట బీట్‌లు పూర్తిగా కనిపించడం లేదు. కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న దామినేడు బ్లాక్ నెంబరు 61లో నాలుగేళ్లుగా నకిలీ మద్యం తయారు చేసే ముడిపదార్థాలు స్టాక్ ఉంచుతున్నా పోలీసులు గుర్తించలేకపోవడం, శనివారం అర్ధరాత్రి వేదాంతపురం విల్లాస్‌లోని 81, 82 ఇళ్లలో దొంగలు చొరబడి చోరీ చేయడం దీనికి ఉదాహరణలుగా చెప్పొచ్చు. అలాగే తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల, శ్రీకాళహస్తి పరిధిలో రెండు నెలల్లో 10 చోరీలు జరగడం పోలీసుల పనితీరును చెబుతోంది.

కనిపించని కార్డన్ సెర్చ్‌లు

ఇటీవల కాలంలో తిరుపతి, తిరుచానూరులో కార్డన్ సెర్చ్‌లు నిర్వహించిన దాఖలాలు లేవు. గతంలో ఆయా స్టేషన్ల పరిధిలో డైనమిక్ బీట్లు, రాత్రి గస్తీలు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించేవారు. ఐదారేళ్లుగా రాత్రి గస్తీలు, పెట్రోలింగ్, రక్షక్ మొబైల్ తనిఖీలు లేవు. కార్డెన్ సెర్చ్‌లు నిర్వహించి ఉంటే కల్తీ మద్యం తయారీ ముడిపదార్థాల నిల్వలు ముందే పట్టుబడి ఉండేవి. అసాంఘిక శక్తులకు అడ్డాగా ఉన్న పాడిపేట, దామినేడు, బాలాజీ డెయిరీ, జీవకోన, సత్యనారాయణపురం, బీటీఆర్ కాలనీతో పాటు శివారు ప్రాంతాల్లో కనుచూపు మేరలో కార్డెన్ సర్చ్‌లు నిర్వహించిన దాఖలాలు లేవు. అందుకే చోరీలు పెరుగుతున్నాయని ఆయా ప్రాంతాల వారు అభిప్రాయపడుతున్నారు. అంతేగాక తిరుపతిలో 12 ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌లు పేట్రేగి పోతున్నాయి. ముఖ్యంగా తిరుచానూరు ప్రాంతంలో భద్రతాపరంగా డొల్లతనం కనిపిస్తోంది.

ఘంటసాల పాటల పోటీలకు విశేష స్పందన



పోటీల్లో పాల్గొన్న గాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఘంటసాల పాటల పోటీలు నిర్వహించారు. 40 మంది గాయకులు పాల్గొని ఘంటసాల పాటలను ఆలపించారు. ఘంటసాల వీరాభిమాని, రిటైర్డు ప్రొఫెసర్ వాసుదేవరావు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతగా డాక్టర్ రహమతుల్లా వ్యవహరించారు. పురుషుల్లో ప్రథమ స్థానంలో నారాయణరావు, కరుణాకర్, ద్వితీయ స్థానంలో శ్రీనివాసశర్మ, ఓబులపతి, తృతీయ స్థానంలో శంకరాచార్యులు, శంకరయ్య నిలిచారు. మహిళల్లో తృతీయ బహుమతి అనూషకు ఇచ్చారు. ప్రోత్సాహక బహుమతులకు కృష్ణకుమారి, కావ్య, ఇందు తదితరులను ఎంపిక చేశారు. ప్రథమ స్థానానికి రూ.15 వేలు, ద్వితీయ స్థానానికి రూ.10 వేలు, తృతీయ స్థానానికి రూ.5 వేలు, ప్రోత్సాహక బహుమతి రూ.500 అందజేశారు. ఫైనల్స్ ఈ నెల 11వ తేదీ విజయవాడలో నిర్వహిస్తారు. కార్యక్రమంలో రాజేష్, అరవింద్ పాల్గొన్నారు.

డ్రోన్‌లపై పోలీసులకు శిక్షణ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసులకు డ్రోన్ల నిర్వహణపై ఆదివారం తిరుపతిలో శిక్షణ ఇచ్చారు. వారం రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతుల్లో రెండవ బ్యాచ్‌కు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి.

నేటి నుంచి వెటర్నరీలో అధ్యాపకులకు సీఏఎస్ ఇంటర్వ్యూలు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని టీచింగ్ ఫ్యాకల్టీకి సోమవారం నుంచి కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్(సీఏఎస్) పదోన్నతులకు సంబంధించిన ఇంటర్వ్యూలు ప్రారంభం కానున్నాయి. తిరుపతి కేంద్రంగా నడిచే వర్సిటీ పరిపాలనా భవనంలో ఈ నెల 3, 5, 6, 8 తేదీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. సెలక్షన్ కమిటీ నేతృత్వంలో జరిగే ఇంటర్వ్యూలకు పదోన్నతికి అర్హత సాధించిన అధ్యాపకులు విభాగాల వారీగా ఆయా తేదీల్లో ఉదయం 9గంటలకు హాజరు కావాలని ఎస్‌ఏసీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు.

పంటలకు పరిహారంపై రైతులతో చర్చలు


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు

కోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీలో గల వీటి అగ్రహారంలో భూములకు పరిహారం విషయమై ఆదివారం తహసీల్దారు జయజయరావు రైతులతో చర్చలు జరిపారు. చిల్లకూరు మండలం రాఘవారిపాళెం, కోట మండలం సరిహద్దు గ్రామాల రైతులకు వీటి అగ్రహారంలో భూములు ఉన్నాయి. ఆ భూములు సాగరమాల రోడ్డు విస్తరణకు తీసుకున్నారు. అయితే ఆయా భూముల్లో రైతులు వరి సాగు చేశారు. ఆ పంటలను ధ్వంసం చేసి రోడ్డు వేసేందుకు రెవెన్యూ అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో పరిహారం గురించి రైతులతో చర్చలు జరిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మధులత, సర్వేయర్ గోపీరెడ్డి, వీఆర్వో రమణయ్య పాల్గొన్నారు.

అన్నను చంపిన తమ్ముడి అరెస్టు


నిందితుడు మస్తానయ్యను అరెస్టు చూపుతున్న పోలీసులు

కోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోట మండలం జరుగుమల్లిలోని గమళ్లపాళెంలో గత నెల 30న కొమారి కోటయ్యను అతని తమ్ముడు మస్తానయ్య రోకలితో కొట్టి హత్య చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పరారీలో ఉన్న మస్తానయ్యను కోట హరిజనవాడలోని వాటర్ ట్యాంక్ వద్ద ఆదివారం అరెస్టు చేసినట్లు వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

వెలమ సంక్షేమ సంఘ కార్యవర్గం ఎంపిక


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్యనాయుడు

నాయుడుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వెలమ సంక్షేమ సంఘ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు గౌరవ అధ్యక్షులు రంగినేని కృష్ణయ్య నాయుడు మునస్వామి నాయుడు తెలిపారు. పుదూరులోని మినీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో వెలమ సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా చింతకాని మధుసూదనరావు, ఉపాధ్యక్షులుగా నేలవల్లి రామచంద్ర నాయుడు, భాస్కర్, రాధాకృష్ణమ నాయుడు, కార్యదర్శులుగా పొట్లపూడి రాజేష్, శేఖర్ నాయుడు, కోశాధికారిగా నేలవల్లి మునికృష్ణ ఎంపికైనట్లుగా వారు పేర్కొన్నారు.

మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్


మీడియాతో మాట్లాడుతున్న బీజేవైఎం నేత మనోజ్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మధ్య తరగతి ప్రజల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం హర్షణీయమని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక మాళవ్యానగర్‌లోని బీజేవైఎం కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల అభివృద్ధికి బడ్జెట్ ప్రాధానం ఇచ్చారని పేర్కొన్నారు. మన రాష్ట్రానికి పోలవరం, రాజధాని అమరావతి అభివృద్ధి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం ఆనందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో శివశంకర్, ప్రణయ్, నవీన్, కిరణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సమన్వయ కమిటీ ఎన్నిక


సమావేశంలో బీసీ సమన్వయ కమిటీ సభ్యులు

గూడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గ బీసీ సమన్వయ కమిటీ కార్యవర్గాన్ని ఆదివారం బీసీ సంఘాల జిల్లా అధ్యక్షుడు రాజమాణిక్యం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా జమాలుల్లా, కన్వీనర్‌గా ఎల్‌వీ సుబ్బయ్య, కో- కన్వీనర్లుగా గురునాధం, శేషయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాశిన భాస్కర్‌గౌడ్, వెంకటేశ్వర్లురాజు, కొండల్‌రావు, కోటేశ్వర రావు, జయచంద్ర, రమణయ్య, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ నగర్‌లోని ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, లక్ష్మీదేవి దాతృత్వంతో పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రాము, మయూరి శ్యామ్ యాదవ్, నాగరాజు, ప్రభాకర్, పురందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వెటర్నరీలో అధ్యాపకులకు సీఏఎస్ ఇంటర్వ్యూలు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని టీచింగ్ ఫ్యాకల్టీకి సోమవారం నుంచి కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్(సీఏఎస్) పదోన్నతులకు సంబంధించిన ఇంటర్వ్యూలు ప్రారంభం కానున్నాయి. తిరుపతి కేంద్రంగా నడిచే వర్సిటీ పరిపాలనా భవనంలో ఈ నెల 3, 5, 6, 8 తేదీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. సెలక్షన్ కమిటీ నేతృత్వంలో జరిగే ఇంటర్వ్యూలకు పదోన్నతికి అర్హత సాధించిన అధ్యాపకులు విభాగాల వారీగా ఆయా తేదీల్లో ఉదయం 9గంటలకు హాజరు కావాలని ఎఫ్ఏసీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కూల్‌డ్రింక్ అనుకుని పురుగుల మందు తాగిన చిన్నారి
పరిస్థితి విషమం

వాకాడు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్టెంబాక సమీపంలో ఉన్న రొయ్యల గుంటల వద్ద రెండేళ్ల చిన్నారి కూల్‌డ్రింక్ అనుకొని పొలాల్లో పడి ఉన్న పురుగుల మందు తాగింది. చిన్నారి మామ తెలిపిన వివరాల మేరకు... చిట్టమూరు మండలం గునపాడు ఎస్టీ కులానికి చెందిన నరేష్ కుటుంబం ముట్టెంబాక గ్రామంలోని ఓ రొయ్యల గుంటల వద్ద పనిచేస్తోంది. ఆదివారం నరేష్ కుమార్తె వెంకటమ్మ (2) పొలాల్లో ఆడుకుంటూ పురుగుల మందు డబ్బాను చూసి కూల్‌డ్రింక్ అని తాగేసింది. గమనించిన చిన్నారి అక్క తల్లిదండ్రులకు తెలిపింది. వెంటనే చిన్నారిని వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

వేణుంబాక సర్పంచు ఆత్మహత్య


సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం వేణుంబాక సర్పంచు తామర్ల సుబ్రహ్మణ్యం(60) ఆత్మహత్య చేసుకున్నాడు. వేణుంబాక గిరిజన కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం కుటుంబ కలహాలతో ఆదివారం గుళికలు మందు తిన్నాడు. నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

రేపు డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 4న మంగళవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీసిటీలోని సీసీఎల్, బ్లూస్టార్, వీల్స్ ఇండియా కంపెనీలు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బి శంకర్ తెలిపారు.

నేడు తుమ్మూరులో వైద్య శిబిరం

నాయుడుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట తుమ్మూరులో సోమవారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా తెలిపారు. ఎల్‌పి సాగరం, తుమ్మూరు అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్య సిబ్బంది పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేస్తారన్నారు.



గ్రావెల్ తవ్వడంతో ఏర్పడిన భారీ గుంతలు - డంపింగ్ చేసిన గ్రావెల్, అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్న వీఆర్వో శ్రీదేవి

రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా

- పేదల ఇంటి స్థలాలనూ వదలని అక్రమార్కులు
- అడ్డుకున్న వీఆర్వోపై చిందులు
- పట్టించుకోని పోలీసులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను తవ్వి పరిశ్రమలకు, వెంచర్లకు తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకొంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో శ్రీకాళహస్తి రోడ్డు పక్కన ఉన్న జగనన్న లేఅవుట్‌లో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రాత్రి వేళల్లో ఇటాచీ, ఎక్స్‌కవేటర్ల సాయంతో గ్రావెల్‌ను తవ్వి మరోచోటుకు తరలించి డంపింగ్ చేస్తున్నారు. అక్కడ నుంచి టిప్పర్ల సాయంతో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మన్నారు పోలూరులో పేదలకు ఇళ్లు నిర్మించేందుకు 40 ఎకరాల్లో రెండు లే అవుట్‌లు నిర్మించారు. ఈ ప్రాంతంలో దొరికే గ్రావెల్‌కు మంచి గిరాకీ ఉండడంతో అక్రమార్కులు ఇంటి స్థలాల్లోనూ తవ్వి తీసుకెళ్లిపోతున్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఇంటి స్థలాల్లో గ్రావెల్ తవ్వి మన్నారుపోలూరు చీపురుగుంట సమీపంలోని పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న ఓ ప్రైవేట్ లే అవుట్‌లో డంపింగ్ చేశారు. అక్కడ టిప్పర్లకు లోడుచేసి సూళ్లూరుపేట సమీపంలో ఉన్న పరిశ్రమలకు, వెంచర్లకు తరలిస్తున్నారు. రెవెన్యూ, పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చినా అటువైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. చివరికి వీఆర్వో శ్రీదేవికి ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటలకు తహశీల్దార్‌కు తెలియజేశారు. ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గ్రావెల్ డంపింగ్ చేసిన ప్రదేశానికి వెళ్లి వెనుతిరిగి వచ్చేశారు. ఉదయం 9గంటల సమయంలో డీఎస్పీకి సమాచారం అందించడంతో మళ్లీ పోలీసులు వెళ్లి గ్రావెల్‌ను తరలించేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని ఇటాచీని వదిలేసి వెళ్లిపోయారు.


గ్రావెల్ తవ్వకాలను నిషేధిస్తూ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

హెచ్చరిక బోర్డులు పెట్టినా..

ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూముల్లో గ్రావెల్ తవ్వితే క్రిమినల్ చర్యలు తీసుకొంటామని తహశీల్దార్ హెచ్చరిక బోర్డు పెట్టినా అక్రమార్కులు లెక్క చేయలేదు. బోర్డు పక్కనే దారి ఏర్పరచుకొని దర్జాగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారు. గ్రావెల్ మాఫియాలో అంతా వైసీపీకి చెందిన వారేనని, వారికి అధికార పార్టీకి చెందిన ముఖ్యనేతలతో సఖ్యత ఉండడం వల్లే దందా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వీఆర్వోపై చిందులు..

గ్రావెల్ దందాను అడ్డుకొన్న వీఆర్వోపై అక్రమార్కులు చిందులు వేయడం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. మా లారీని పట్టుకొంటారా... ఇప్పుడు నీకు ఫోన్ వస్తుంది చూడు అంటూ ఆవేశంతో ఊగిపోయారు. ఫిర్యాదును మార్చి ఇవ్వమని వీఆర్వోపై పోలీసులు ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. గ్రావెల్ తవ్వకానికి తెచ్చిన ఇటాచీని పోలీసులు వదిలేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

బడికెళ్లాలంటే ఏరు దాటించాల్సిందే

రుద్రవరంవాసుల జల సాహసాలు

కోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలో పంచాయతీ కేంద్రమైన రుద్రవరం గ్రామస్తులకు స్వర్ణముఖినది యమపాశంలా మారింది. గ్రామంలో 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాల ఉంది. 6 నుంచి 10 తరగతులు చదువుకునేందుకు సమీపంలో ఎక్కడా ఉన్నత పాఠశాల లేదు. 12 కిలోమీటర్లు ప్రయాణించి చిట్టేడు ఉన్నత పాఠశాలకు వెళ్లాలి. లేదా 9 కిలోమీటర్లు ప్రయాణించి చిట్టమూరు మండలం గునపాడు ఉన్నత పాఠశాలకు వెళ్లాలి. అయితే చిట్టమూరు మండలంలోని మెట్టు ఉన్నత పాఠశాల ఒకటిన్న కిలోమీటరు దూరంలో ఉన్నా అక్కడకు వెళ్లడానికి దారిలేదు. స్వర్ణముఖినది దాటితే పాఠశాలకు వెళ్లొచ్చు. ఎండాకాలం అయితే విద్యార్థులు ఏటిలో నడుచుకుంటూ వెళ్లిపోతారు. ఇబ్బందులన్నీ వానాకలంలోనే. అక్టోబరు నుంచి మార్చి వరకు స్వర్ణముఖినదిలో నీళ్లు పుష్కలంగా ఉంటాయి. ఇటీవల కురిసిన వర్షాలతో స్వర్ణముఖినది ప్రవాహం కొనసాగుతోంది. దీంతో రుద్రవరం గ్రామానికి చెందిన విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 20మంది పిల్లలు ఉండగా రోజుకు ఇద్దరి తల్లిదండ్రులు చొప్పున వంతులు వేసుకొని అతి కష్టంపై ఏటిలో నడుచుకుంటూ వెళ్లి విద్యార్థులను నది దాటించి మెట్టు ఉన్నత పాఠశాలకు పంపుతున్నారు. సాయంత్రం కూడా తల్లిదండ్రులు నది అవతలకు వెళ్లి పిల్లలను తీసుకురావాల్సిందే. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు నది దాటుతున్న సమయంలో ఇద్దరు పశువుల కాపర్లు, ముగ్గురు విద్యార్థులు, నలుగురు గ్రామస్తులు ప్రాణాలు కోల్పోయారు. స్వర్ణముఖినదిపై వంతెన నిర్మించి తమ ప్రాణాలను కాపాడాలని ఎన్నో ఏళ్ల నుంచి ప్రజాప్రతినిధులను, అధికారులను వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా తమ సమస్య పరిష్కరించాలని రుద్రవరం గ్రామస్తులు కోరుతున్నారు.


పిల్లలను ఏరు దాటిస్తున్న తల్లిదండ్రులు

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి క్యాలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బలిజ సంఘం మండల కన్వీనర్ దొంతి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు మునిశేఖర్, మహిపాల్, భీమన శ్రీధర్, కొట్టే గిరి, తోట రమేష్, శంఖు సురేష్, సుంకర ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతకు పొంగళ్లు


పొంగళ్లు పెట్టేందుకు వెళ్తున్న గ్రామస్తులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరిమిటిపాడులో గ్రామదేవత ముప్పాలమ్మకు ఆదివారం గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. ఇళ్ల వద్దనుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండుకు సమీపంలోని ఫ్లైవోవర్‌పై కారు వేగంగా వెళుతూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. అయితే కారులోని వారికి ఎటువంటి గాయాలూ కాలేదు.

తిరుచ్చిపై సుందరరాజస్వామి అభయం

తిరుచానూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్ర పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవర్లకు వేడుకగా అభిషేకం జరిగింది. ఉభయదేవేరిలతో పాటు స్వామివారికి ఆదివారం రాత్రి తిరువీధి ఉత్సవం జరిగింది. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్ నాయుడు, చలపతి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి


శివ(ఫైల్‌ఫొటో)

డక్కిలి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెలికల్లు గ్రామానికి చెందిన పొట్టి శివ(24) ఆదివారం మృతి చెందారు. గత నెల జనవరి 1వ తేదీన వెలికల్లు గ్రామానికి చెందిన చెలికం శ్రీనివాసులు రెడ్డి, శివ రాపూరు నుంచి వెలికల్లు గ్రామానికి మోటారు బైక్‌పై వెళ్తుండగా సిద్దవరం గ్రామం వద్ద ప్రమాదానికి గురయ్యారు. చెలికం శ్రీనివాసులురెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా శివ తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్న శివ ఆదివారం తెల్లవారు జామును మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించాలి

గూడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కూలి పనులకు వచ్చి ప్రమాదవశాత్తు మృతి చెందిన పాపయ్య కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థికసాయం అందించాలని సీఐటీయూ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ చిల్లకూరు మండలం తిమ్మనగారిపాళెం గ్రామానికి చెందిన పాపయ్య శనివారం గూడూరులోని ఓ భవనంలో పనులు చేస్తుండగా గోడ కూలి మీద పడడంతో మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుడి కుటుంబానికి భవన యజమాని ఆర్థికసాయం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీరమణయ్య, సురేష్, శంకయ్య, జిలానీ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు విశేష పూజలు



కోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 5 గంటలు

తిరుమల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. శుక్రవారం నాటి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు లభించింది. శనివారం శ్రీవారిని 80,871 మంది భక్తులు దర్శించుకున్నారు.

డ్రోన్‌లపై శిక్షణ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసులకు డ్రోన్ల నిర్వహణపై ఆదివారం తిరుపతిలో శిక్షణ ఇచ్చారు. వారం రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతుల్లో రెండవ బ్యాచ్‌కు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి.

గుర్తుతెలియని వాహనం ఢీకొని డ్రైవర్ మృతి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం కూడలి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ డ్రైవర్ దశరథ రామయ్య(35) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. దొరవారిసత్రం మండలం నెలబల్లి గ్రామానికి చెందిన దశరథరామయ్య లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి మల్లాం కూడలి వద్ద రోడ్డు పక్కన నిలబడి ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేత కుటుంబాలకు పరామర్శ


గోపాల్‌ను పరామర్శిస్తున్న నెలవల తదితరులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మల్లు గోపాల్ కుటుంబసభ్యులను సూళ్లూరుపేట ఇన్‌చార్జి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పరామర్శించారు. ఆదివారం మల్లు గోపాల్ తల్లి వెంకటసుబ్బమ్మ మృతి చెందడంతో ఆమె మృతదేహానికి నెలవల సుబ్రహ్మణ్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెలవల వెంట టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి, నాయకులు కృష్ణయ్య, శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు


తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. చేతికందే ఎత్తులో ఏర్పాటు చేయడంతో తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజులు కూడా చేతి కందేలా ఉండడంతో మూగజీవాలు విద్యుదాఘాతానికి గురవుతున్నాయి. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

పడకేసిన నిఘా

రెండు నెలల్లో 10 చోరీలు
మొన్న దామినేడులో కల్తీ మద్యం తయారీ కలకలం
నేడు సీపీఆర్ విల్లాస్‌లో చోరీ
వరుస ఘటనలతో హడలిపోతున్న నగర ప్రజలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు నిఘా పడకేసింది. రాత్రిపూట బీట్‌లు పూర్తిగా కనిపించడం లేదు. కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న దామినేడు బ్లాక్ నెంబరు 61లో నాలుగేళ్లుగా నకిలీ మద్యం తయారు చేసే ముడిపదార్థాలు స్టాక్ ఉంచుతున్నా పోలీసులు గుర్తించలేకపోవడం, శనివారం అర్ధరాత్రి వేదాంతపురం విల్లాస్‌లోని 81, 82 ఇళ్లలో దొంగలు చొరబడి చోరీ చేయడం దీనికి ఉదాహరణలుగా చెప్పొచ్చు. అలాగే తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల, శ్రీకాళహస్తి పరిధిలో రెండు నెలల్లో 10 చోరీలు జరగడం పోలీసుల పనితీరును చెబుతోంది.

కనిపించని కార్డెన్ సెర్చ్‌లు

ఇటీవల కాలంలో తిరుపతి, తిరుచానూరులో కార్డెన్ సెర్చ్‌లు నిర్వహించిన దాఖలాలు లేవు. గతంలో ఆయా స్టేషన్ల పరిధిలో డైనమిక్ బీట్లు, రాత్రి గస్తీలు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించేవారు. ఐదారేళ్లుగా రాత్రి గస్తీలు, పెట్రోలింగ్, రక్షక్ మొబైల్ తనిఖీలు లేవు. కార్డెన్ సెర్చ్‌లు నిర్వహించి ఉంటే కల్తీ మద్యం తయారీ ముడిపదార్థాల నిల్వలు ముందే పట్టుబడి ఉండేవి. అసాంఘిక శక్తులకు అడ్డాగా ఉన్న పాడిపేట, దామినేడు, బాలాజీ డెయిరీ, జీవకోన, సత్యనారాయణపురం, బీటీఆర్ కాలనీతో పాటు శివారు ప్రాంతాల్లో కనుచూపు మేరలో కార్డెన్ సర్చ్‌లు నిర్వహించిన దాఖలాలు లేవు. అందుకే చోరీలు పెరుగుతున్నాయని ఆయా ప్రాంతాల వారు అభిప్రాయ పడుతున్నారు. అంతేగాక తిరుపతిలో 12 ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌లు పేట్రేగిపోతున్నాయి. ముఖ్యంగా తిరుచానూరు ప్రాంతంలో భద్రతాపరంగా డొల్లతనం కనిపిస్తోంది.

పుత్తూరు వార్తలు

ఎమ్మెల్యే చొరవతో అన్న క్యాంటీన్ పనుల్లో కదలిక

నెలాఖరుకు పూర్తి



పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పేదలు, కష్టజీవులెరూ ఆకలితో అలమటించకూడదనే లక్ష్యంతో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కాగా, పుత్తూరులో క్యాంటీన్ నిర్మాణ పనుల్లో జాప్యం నెలకొంది. మూడు నెలల గడువుతో రూ.62.10 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్ట్ అప్పగించారు. సెప్టెంబర్‌లో ప్రారంభమైన పనులు నాలుగు నెలలవుతున్నా పూర్తి కాలేదు. ఈ క్రమంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవ తీసుకున్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. క్యాంటీన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్ పనుల్లో వేగం పెంచారు. ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తి చేస్తామని ఎమ్మెల్యేకి హామీ ఇచ్చారు.

ప్రమాదకరంగా చీమలవారి వంక కాజ్‌వే



వడమాలపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలోని కాజ్‌వే మళ్లీ రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గత ఏడాది డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు వడమాలపేట సమీపంలోని చీమలవారి వంక కాజ్‌వే కుంగి రాకపోకలకు అంతరాయం కలిగింది. స్పందించిన ఎమ్మెల్యే భానుప్రకాష్, కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి కాజ్‌వేను పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలను కొనసాగించారు. అయితే కాజ్‌వే వద్ద సిమెంట్ రోడ్డు బీటలు వారడంతో డ్రైవర్లు భయపడుతున్నారు. దీంతో వడమాలపేటకు బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి.శాశ్వత నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

అమరావతికి సీతారామపురంవాసుల విరాళం

వడమాలపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణం కోసం వడమాలపేట మండలం సీతారామపురంవాసులు తమ వంతుగా రూ.50 వేల ను విరాళంగా అందించారు. ఈమేరకు తిరుపతి నగరంలోని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ స్వగృహంలో ఆయనకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజధాని అమరావతి పునర్నిర్మాణంలో సీతారామపురంవాసుల పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికారి ప్రతినిధి ధనంజయులు నాయుడు, నాయకులు దేవానంద నాయుడు, దేవరాజులు నాయుడు, మునినాథం, హరిప్రసాద్, పార్థసారథి నాయుడు, రాజేంద్ర, చెంగ్రాయులు తదితరులు పాల్గొన్నారు.

55 యేళ్ల తర్వాత...

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పుత్తూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): యాభై ఏళ్ల తరువాత తాము చదివిన కళాశాలలో విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకున్నారు. పుత్తూరు ప్రభుత్వ ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాలలో 1967-71లో చదివిన విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఆహ్లాదకరంగా జరిగింది. వయస్సు మీద పడుతుండడంతో సంఘం ఆశయాలను కొనసాగించేందుకు ప్రస్తుత పూర్వ విద్యార్థుల సంఘంలో విలీనం చేయాలని ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే కళాశాల స్థాపకుడు సాతులూరి రంగయ్య శ్రేష్ఠి విగ్రహ ప్రతిష్ఠాపన చేయాలని తీర్మానించారు. ఉమాపతి, భూపతి, శ్రీనివాసులు భాస్కర్, కాళప్ప, ప్రసాద్‌వర్మ, రామకృష్ణ, సుబ్రమణ్యంరాజు, రామచంద్రరాజు, రాఘవ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కుంభాభిషేకంలో ఎమ్మెల్యే



సిద్ధేశ్వర స్వామిని దర్శించుకున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పరిధిలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చెర్లోపల్లిలో కొలువై ఉన్న కామాక్షి దేవి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అంతకుముందు మండలంలోని కేబీఆర్‌పురంలోని కృష్ణ ఆలయ కుంభాభిషేకానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం తీర్థప్రసాదాలు అందుకున్నారు. పుత్తూరు బైపాస్‌లో షిర్డీ సాయిబాబా కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేకుండానే రోడ్డుపైకి...



పోలీస్ కంట్రోల్ రూంను ఢీకొన్న లారీ(ఫైల్)

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పుత్తూరు నడిబొడ్డున పోలీస్ కంట్రోల్ రూంను ఢీకొన్న లారీకి ఫిట్‌నెస్ లేదన్న విషయం వెలుగుచూసింది. నెం. ఏపీ 21 యు 1239 లారీ రెండు సంవత్సరాలు అద్దె ప్రాతిపదికన పౌరసరఫరాల శాఖకు కేటాయించారు. మార్చి నెలతో లీజు ముగియనుంది. లారీ కండీషన్‌లో లేకుండానే ప్రమాదకర పరిస్థితుల్లో పుత్తూరు పౌర సరఫరాల గోడౌన్ నుంచి పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట మండలాలకు రేషన్ తరలించేందుకు వినియోగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పోలీస్ కంట్రోల్ రూంను లారీ ఢీ కొంది. కాగా, పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు. కంట్రోల్ రూం నిర్మించి ఇస్తానని సదరు వాహన యజమాని పోలీసులకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికైనా పోలీస్, ఆర్టీఏ అధికారులు రహదారులపై తిరిగే వాహనాలకు, ప్రజా రవాణాకు వినియోగించే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వడమాలపేట, 2 ఫిబ్రవరి(ఆంధ్రజోతి): మండలంలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ చెప్పారు. వడమాలపేట మండలంలో ఎంటీ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

రథసప్తమికి ప్రణాళికబద్ధంగా సేవలందించాలి: ఈవో

తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): రథసప్తమికి వచ్చే భక్తులకు ప్రణాళికబద్ధంగా సేవలు అందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఉద్యోగులను కోరారు. తిరుమలలోని ఆస్థానమండపంలో ఆదివారం జరిగిన సమావేశంలో టీటీడీ ఈవో, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, ఇంచార్జి సీవీఎస్వో మణికంఠ, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. పోలీసులు, విజిలెన్స్ శాఖలతో సమన్వయం చేసుకుని అన్నదానం, పోలీసు, విజిలెన్స్, ఇంజినీరింగ్, వైద్య, ఆరోగ్య, శానిటేషన్ తదితర శాఖ అధికారులు, సిబ్బంది ఉమ్మడి కార్యచరణతో సేవలు అందించాలన్నారు. మాడవీధుల్లో దాదాపు 200 గ్యాలరీలు, 66 అన్నదాన కౌంటర్లు, 351 టాయిలెట్లు ఏర్పాటు చేశామన్నారు. అనదపు ఈవో వెంకయ్య చౌదరి, ఎస్పీ, సీవీఎస్వో మణికంఠ మాట్లాడారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

కంటి వైద్యశిబిరానికి స్పందన

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనపురంలో ఆస్రా కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన కంటి శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు అరుణ్ సుభాష్‌రెడ్డి, లోకేశ్వరి ఆధ్వర్యంలో లోకా ఫౌండేషన్ ధ్యానమందిరంలో వైద్యపరీక్షలు జరిగాయి. సుమారు వందమందికి పైగా పరీక్షలు చేయించుకున్నారు.

గ్రామీణ రోడ్లు ఛిద్రం... ఇబ్బంది పడుతున్న జనం







తారు లేచిపోయి గుంతలమయమైన కొత్తపాళెం రోడ్డు - పూసలపల్లి దగ్గర దుస్థితికి చేరుకున్న రోడ్డు - జీఎస్‌కండ్రిగ గ్రామం దగ్గర కంకర తేలిన తారు రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాళెం, జీఎస్ కండ్రిగ, గాజులపెళ్ళూరు, పూసలపల్లి, చిన్నపాలేడు, కల్లివెట్టు, ఆలత్తూరు, పీవీకండ్రిగ తదితర గ్రామీణ రోడ్లు ఛిద్రమయ్యాయి. ఐదు సంవత్సరాల వైసీపీ హయాంలో గ్రామీణ రోడ్లు నిర్వహణ గాలి కొదిలేసింది. దీంతో గ్రామీణులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కొత్తపాళెం రోడ్డు అయితే కేటి రోడ్డు నుంచి రెండు కిలోమీటర్లు వరకు అడుగడుగున గుంతలతో అధ్వానంగా మారింది. కేటి రోడ్డు నుంచి జంబుగోళం రోడ్డు తారు లేచిపోయి కంకర తేలి ప్రయాణం నరకప్రాయమవుతోంది. ఇక ఆలత్తూరు, పీవీకండ్రిగ రోడ్లదీ అదే దారి. ఆరు కిలో మీటర్లు దాటడానికి సుమారు గంట పడుతోంది. గాజులపెళ్లూరు రోడ్డు పరిస్థితి కూడా దారుణంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత గ్రామీణ రోడ్లు మరమ్మతులు చేస్తారని ఎదురు చూస్తున్నా ఇప్పటి వరకు నిధులు మంజూరు చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ఆదిమూలం స్పందించి గ్రామీణ రోడ్లుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ముక్కంటి సేవలో పలువురు ప్రముఖులు







ఆలయం వద్ద దేవదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ - పెంచల కిషోర్‌కు ప్రసాదాల అందజేత- కుటుంబ సభ్యులతో ప్రీతి నిగం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నరు. ఈవో బాపిరెడ్డి, వేద పండితులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అదే విధంగా కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఈవో పెంచలకిషోర్ కూడా దర్శించుకున్న వారిలో ఉన్నారు.

బుల్లితెర నటి ప్రీతినిగం

● జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం సినీ, బుల్లితెర నటి ప్రీతి నిగం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం దక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నెప్పళ్ల మండపాన్ని పూర్తి చేయండి



మండపాన్ని పరిశీలిస్తున్న హిందూ ధార్మిక మండలి సభ్యులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం భిక్షాల గాలిగోపురం పక్కన ఉన్న నెప్పళ్ల మండపాన్ని పూర్తి చేయాలని హిందూ ధార్మిక మండలి పట్టణ కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబు కోరారు. ఆదివారం మండపాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాల్లో రథోత్సవం సందర్భంగా అమ్మవారికి ఈ మండపంలో పూజలు నిర్వహిస్తారన్నారు. మరమ్మతులకు గురి కావడంతో పది సంవత్సరాల క్రితం తొలగించారన్నారు. అప్పటి నుంచి రేకులషెడ్డులోనే కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. సంవత్సరాలు గడుస్తున్నా పునర్నిర్మాణం జరపకపోవడం బాధాకరమన్నారు. ఆలయ ఆధ్వర్యంలో పురాతన ఆలయాలు, మండపాల పునర్నిర్మాణం, నూతన కట్టడాలను చేస్తున్నా దీన్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి నెప్పళ్ల మండపానికి మోక్షం కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసుయాదవ్, డిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నాయకుడి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి పంచి పెడుతున్న ఆణిముత్యం నందకిషోర్

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన టీడీపీ యువ నాయకుడు, ఎన్ఆర్ఐ ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబూరు, మరదవాడ, వరదయ్యపాళెం, సంతవేలూరుల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నందకిషోర్‌రెడ్డి ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నా యకులు దశరథన్, మునిరాజ, జయశంకర్ రెడ్డి, పవన్‌నాయుడు, చలపతినాయుడు, బాలయ్య, యువరాజ్, ప్రశాంత్, అజిత్, నిరంజన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

7న 'లక్షల డప్పులు, వేల గొంతులు'ను విజయవంతం చేద్దాం



డప్పు కొడుతున్న హరి మాదిగ, నీరుపాకు దొరబాబు మాదిగ

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 7(ఆంధ్ర జ్యోతి): హైదరాబాద్ వేదికగా ఈనెల 7వ తేదీ జరగనున్న లక్షల డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని విజ యవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు హరి మాదిగ, నీరుపాకు దొరబాబు మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని ఎంజీనగరం మాదిగపల్లెలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ లక్ష్య సాధనకు మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్సీల రిజర్వేషన్ చట్టబద్ధత చేసుకునే హక్కు ఉందని తీర్పు ఇచ్చిందని తెలిపారు. మాదిగల స్థితిగతులపై హైదరాబాద్‌లో జరగనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. చందు, భాస్కర్, శ్రీను, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్‌హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హెల్పింగ్‌హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయమని రాయలసీమ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కాయం సుబ్బరామిరెడ్డి అన్నారు. హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ 158వ నెల దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం ఈ సంస్థ ద్వారా ఇద్దరు పిల్లలకు ఫీజు రాయితీ ఇస్తామన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు మునీర్‌బాషా, సభ్యులు గుమ్మళ్ల రాజేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు, బాబా ఫరీద్, హరినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ ఏక్తా యాత్ర ప్రతినిధులకు ఘనస్వాగతం



యాత్ర ప్రతినిధులకు స్వాగతం పలుకుతున్న నాయకులు

రేణిగుంట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : భారత్ ఏక్తా యాత్ర ప్రతినిధులకు ఆదివారం రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ఘనస్వాగతం లభించింది. ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు వారికి స్వాగతం పలికారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ యాత్రలో భాగంగా శ్రీహరికోట, శ్రీసిటీ, ఐసర్, ఐఐటీ, ఎస్వీ యూనివర్శిటీ, జాతీయ సంస్కృత విద్యాపీఠం తదితర విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, ఆచార్యులు, విద్యార్థులతో చర్చా కార్యక్రమాలు జరుగుతాయని ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్గాని సోమశేఖర్, ఎం.వెంకట రమణయ్య, సుమన్, రాఘవేంద్ర, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తపాలా జీవిత బీమాను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి సబ్ డివిజన్ తపాలా ఇన్‌స్పెక్టర్ బాలాజీ కోరారు. శ్రీకాళహస్తి మండలం చల్లపాళెంనకు చెందిన వి.హర్షవర్ధన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన గతంలో చల్లపాళెం పోస్టాఫీసులో ఏడాదికి రూ.72వేలు చొప్పున మూడు సంవత్సరాలు చెల్లించారు. అతను మృతి చెందడంతో ఆదివారం అతని తల్లి మాయాదేవికి రూ.6,47,581ను అందజేశారు. తపాలాశాఖ ఇతర బీమా సంస్థలకన్నా తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్ అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తపాలాశాఖ అధికారులు కుషిత్ బేగం, వాసుదేవ, మురళి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

రేణిగుంట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడు నవీన్‌కు 14 రోజుల రిమాండ్‌కు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ కేసులో అరెస్టు చేసిన అనంతపురం జిల్లాకు చెందిన నవీన్‌ను డీఎస్పీ శ్రీనివాసరావు విచారణ అనంతరం కోర్టుకు హాజరుపరచగా ఆ మేరకు న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్టు పేర్కొన్నారు.

జాతీయ రిసోర్స్ పర్సన్ శిక్షణకు కూనాటి సురేష్



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2(ఆం ధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4నుంచి 13వ తేదీ వరకు జాతీయ స్థాయి రిసోర్స్ పర్సన్ల శిక్షణ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి పాల్గొనే అవకాశం శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కూనాటి సురేష్‌కు దక్కింది. జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమాలను రూపొందించి రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణకు ప్రణాళిక రచించనున్నారు. రాష్ట్రం నుంచి ఐదుగురికి అవకాశం రాగా అందులో కూనాటి సురేష్ ఒకరు. పలువురు ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

ఉత్తమ డిపోగా తీర్చిదిద్దుతాం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోను రాష్ట్రంలో ఉత్తమ డిపోగా తీర్చి దిద్దుతామని ఇన్ చార్జి మేనేజరు మునిచంద్రయ్య అన్నారు. తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజరుగా పనిచేస్తున్న మునిచంద్రయ్య పదోన్నతిపై శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజరుగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను యూనియన్ నాయకులు, డిపో సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది తదితరులు సత్కరించారు.

కొనసాగుతున్న పైప్‌లైన్ మరమ్మతులు

నేడు ఆలస్యంగా తాగునీటి సరఫరా



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పురపాలకసంఘ పరిధిలో సోమవారం తాగునీటి సరఫరా ఆలస్యం అవుతుందని కమిషనర్ గిరికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మద్రాసు రోడ్డులోని చిలకమ్మ ఆలయం వద్ద పెద్ద పైపులైను 800 జీఆర్పీ మరమ్మతులు జరుగుతున్నాయని తెలిపారు. దీంతో తాగునీటి సరఫరా ఆలస్యం అవుతుందన్నారు. మధ్యాహ్నానికి పునరుద్ధరిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.